
10 YEAR ANNIVERSARY 2014 - 2024


# పెన్ పవర్

## తెలంగాణ రౌండప్

శుక్రవారం 18 అక్టోబర్ 2024 పేజీలు 8




307 ఎస్ఎఫ్‌సి భూముల్లో వెంచర్..



కుత్బుల్లాపూర్ డిప్యూటీ తహశీల్దార్‌కి ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నేతలు..

## ప్రభుత్వ భూమిలో...

# కబ్జాదారుల లేఅవుట్‌లు

### రూ.150 కోట్లు విలువైన 16 ఎకరాల ప్రభుత్వ భూమిలో బీఆర్ఎస్ నాయకుని పాగా..?

- కుత్బుల్లాపూర్ గాజులరామారం సర్వే నెం.307 ఎస్ఎఫ్‌సి భూముల్లో దర్జాగా వెంచర్‌లు..
- ఓవైపు గాలిపోచమ్మ బస్తీ.. మరోవైపు బాలయ్య బస్తీని ఆనుకుని 307లో మరో నూతన లేఅవుట్..
- క్వారీలు పూడ్చి.. కబ్జాలు చేసి..! ట్రెండ్ మార్చిన కబ్జాదారులు "ఓఎల్ఎక్స్"లో విక్రయాలు..?
- ప్రభుత్వ స్థలంలో 477 ప్లాట్‌లతో వెంచర్ నిర్మాణం.. మాయ మాటలతో పేదలకు విక్రయాలు..
- ప్రజల ఆస్తుల పరిరక్షణకై తెలంగాణ ప్రభుత్వం హైడ్రాను అధికారాలను విస్తరిస్తుంటే..!
- స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ సంస్థ(ఎస్ఎఫ్‌సి) భూములపై రెవెన్యూ నిర్లక్ష్యం..

కబ్జాలు చేసేటోళ్ళకు.. కాపాడే వాడు ఒకడు ఉంటే చాలు..! ప్రభుత్వ భూములే కాదు..! చార్మినార్, గోల్కొండ, ట్యాంక్ బండ్‌ని కూడా విక్రయిస్తారని గాజులరామారం కబ్జాలు అందుకు ఉదాహరణగా చెప్పవచ్చు.. సర్వే నెంబర్ 307 ఎస్ఎఫ్‌సి భూములతో కబ్జాదారులు వందల కోట్లు కొల్లగొడుతున్నారు.. ఒకప్పుడు క్రషర్‌లతో నిబంధనలు ఉల్లంఘించి పాతాలానికి తవ్వకాలు జరిపినా మైనింగ్ అధికారులు పట్టించు కోలేదు.. ఇప్పుడు అవే క్వారీలు పూడ్చేసి దర్జాగా లేఅవుట్‌లు నిర్మించి పేదలకు విక్రయిస్తున్న అక్రమార్కులకు అధికారుల అండా దండా ఉండటం విశేషం.. ఇదంతా కుత్బుల్లాపూర్ తహశీల్దార్ కార్యాలయానికి కూత వేటు దూరంలోనే ఈ కబ్జా వ్యవహారం కొనసాగటం గమనార్హం..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, అక్టోబర్ 17:**




-2లో

## మూసీపై అసెంబ్లీలోనే మాట్లాడుకుందాం రండి..

### ప్రతిపక్షాలకు సీఎం రేవంత్ ఓపెన్ ఆఫర్




**హైదరాబాద్ పెన్ పవర్:**మూసీ పునర్జీవనంపై.. హైదరాబాద్ ప్రజల భవిష్యత్‌పై.. మూసీ వల్ల నల్గొండ జిల్లా ప్రజలు పడుతున్న ఇబ్బందులపై.. చర్చించేందుకే ముందుకు రావాలని ప్రతిపక్షాలకు కోరారు సీఎం రేవంత్ రెడ్డి. సూచనలు, సలహాలను అసెంబ్లీలోనే చర్చిద్దాం అని.. మాట్లాడుకుందాం అని.. దీని కోసం సిద్ధంగా ఉన్నట్లు.. బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం పార్టీలకు పిలుపునిచ్చారు సీఎం రేవంత్ రెడ్డి.

-2 లో

## పదేళ్లలో తెలంగాణను నాశనం చేసిండు

**హైదరాబాద్ పెన్ పవర్:**పదేళ్లలో కేసీఆర్ తెలంగాణను నాశనం చేశాడని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ విమర్శించారు. తాగుబోతు, తిరుగుబోతు తండ్రి ఉంటే సంసారం ఎలా దెబ్బతింటుందో.. అచ్చం అలాగే గత పదేళ్ళలో తెలంగాణ రాష్ట్రం కూడా ఖరాబు అయిందని.. మొత్తం నాశనం చేశారని

-2 లో



# ప్రభుత్వ భూమిలో.. కబ్జాదారుల లేఅవుట్‌లు..



కబ్జాదారుల లేఅవుట్ కాపీ..



## అమాయక పేదలు మోసపోతున్నారు..

గాజులరామారం సర్వే నెంబర్ 307 ప్రభుత్వ భూమి 16 ఎకరాల ఆక్రమించుకొని, ఎలాంటి అనుమతులు లేకుండా 477 ప్లాట్లుగా చేసి..! తప్పుడు పత్రాలు సృష్టించి ప్రజలకు విక్రయించడానికి, కబ్జాదారులు భిన్న మార్గాలను ఎంచుకుంటున్నట్లు బీజేపీ నేతలు అధికారుల దృష్టికి తీసుకెళ్ళారు..మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా వంటి సంస్థలను విస్తరింప చేస్తుంటే.. ఇలా ప్రభుత్వ భూములు ఆక్రమించుకొని పేదలకు కట్టబెట్టేందుకు చూస్తున్నారని ఆరోపించారు.. ప్రభుత్వ భూమిలో వేస్ట్ మెటీరియల్‌తో పూడ్చి వేస్తూ, ప్రజా ఆస్తిని కొల్లగొట్టడానికి ప్రయత్నం చేస్తున్న బీఆర్ఎస్ నాయకుడుపై వెంటనే చర్యలు చేపట్టాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.. తక్షణమే ప్రభుత్వ భూమిగా హెచ్చరిక బోర్డుని ఏర్పాటు చేయాలని, ఫెన్సింగ్ వేసి రక్షించాలని, ప్రజలు కొనుగోలు చేసి నష్టపోకుండా చూడాలన్నారు.. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ గౌడ్, అరుణ్ రావు, చందు, బలరాం తదితరు పాల్గొన్నారు.

- మొదటి పేజి తరువాయి

మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ గాజులరామారం సర్వే నెంబర్ 307 స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ సంస్థకి కేటాయించిన ప్రభుత్వ భూముల్లో యధేచ్ఛగా అక్రమ లేఅవుట్లు నిర్మిస్తున్నారు.. బాలయ్య బస్తీ ఆనుకొని ప్రముఖ ప్రజాప్రతినిధి అనుచరుడు, ఓ బీఆర్ఎస్ నాయకుడు రూ.150 కోట్ల విలువ చేసే 16 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాపై బీజేపీ నాయకుడు ఆకుల సతీష్ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు.. క్వారీ ఆక్రమించుకొని, మట్టితో నింపి రెవెన్యూ మున్సిపల్ అనుమతులు లేకుండానే 477 ప్లాట్లుగా చేసి, లక్షలాది రూపాయలకు పేద ప్రజలే లక్ష్యంగా విక్రయాలు జరుగుతున్నాయని ఆరోపించారు.. ఏకంగా "ఓఎల్ఎక్స్"లో అమ్మేందుకు చేసే ప్రయత్నాలను ఆదిలోనే అరికట్టాలని కుత్బుల్లాపూర్ డిప్యూటీ ఎమ్మార్వోకి పూర్తి ఆధారంతో ఫిర్యాదు చేశారు.. సర్వే నెంబర్ 307, గాజుల రామారా%శీ%, బాలయ్య బస్తీని ఆనుకొని గతంలో ప్రభుత్వం మైనింగ్ కోసం లీజు ఇచ్చిన కొండ ప్రాంతాన్ని మట్టితో చదును చేసి, దీనికి సంబంధించి 16 ఎకరాల ప్రభుత్వ స్థలం ఆక్రమించుకొని,477 ప్లాట్లతో వెంచర్ నిర్మాణం చేపట్టడంపై చర్యలు చేపట్టాలని కోరారు.. కావలసిన పత్రాలు తయారు చేసుకుని, ప్లాట్లుగా చూపిస్తూ పేద ప్రజలకు అమ్మడానికి బిఆర్ఎస్ నేత ప్రయత్నాలకు అడ్డుకట్ట వేయాలని, ప్రజల ఆస్తులను కాపాడాలని డిమాండ్ చేశారు.. ఈ 16 ఎకరాల క్వారీ ప్రాంతాన్ని మట్టితో గత వారం రోజులుగా పూడ్చివేస్తూ చదును చేస్తున్నారని, గత పది సంవత్సరాలుగా బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ప్రజాప్రతినిధి అండదండలతో వారి అనుచరులు దాదాపు 900 ఎకరాలు ప్రభుత్వ భూములు కుత్బుల్లాపూర్ పరిధిలో ఆక్రమించుకొని, అక్రమ లేఔట్ వేసి పేద ప్రజలకి అంటగట్టి ఇబ్బందులకు గురిచేసింది అందరికి తెలిసిందేనని అన్నారు..

## మూసీపై అసెంబ్లీలోనే మాట్లాడుకుందాం రండి..

### ప్రతిపక్షాలకు సీఎం రేవంత్ ఓపెన్ ఆఫర్

- మొదటి పేజీ తరువాయి

అక్కడా ఇక్కడా కాదని.. ఏకంగా అసెంబ్లీలోనే మాట్లాడుకుందాం అన్నారాయన. అసెంబ్లీలోకి ఆయా పార్టీల ఎంపీలు వచ్చి మాట్లాడేందుకు అవకాశం ఉంటే.. న్యాయ నిపుణులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని.. నా ఓపెన్ ఆఫర్ కు సిద్ధమా అని బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం పార్టీలకు పిలుపునిచ్చారు సీఎం రేవంత్ రెడ్డి.

మూసీపై రాద్ధాంతం చేస్తున్న వాళ్లు మూసీ పక్కన మూడు నెలలు అయినా ఉండగలరా అని ప్రశ్నిస్తున్నా.. అలా ఉంటే ఆ కిరాయి డబ్బులు నేనే కడతానంటూ కేటీఆర్, ఇతర నేతలకు సీఎం రేవంత్ రెడ్డి సవాల్ చేశారు.

## హుజూరాబాద్ ఏరియా హాస్పిటల్ బీ ప్రసూతి విభాగంలోని బాత్రూంలో పిండం

హైదరాబాద్ పెన్ పవర్:హుజూరాబాద్ ఏరియా హాస్పిటల్‌లో దారుణం చోటుచేసుకుంది. ఆసుపత్రిలోని ప్రసూతి విభాగంలోని స్త్రీల మరుగుదొడ్డిలో పిండం కనిపించింది. పిండం చనిపోయింది. హాస్పిటల్ కు వచ్చిన పేషెంట్లో ఒకరు అది గుర్తించి డాక్టర్లకు ఫిర్యాదు చేశారు. ఎవరైనా మహిళ బాత్ రూమ్ కి వెళ్ళిన సమయంలో అబార్షన్ అయి ఉంటుందని వైద్యులు భావిస్తున్నారు. ఈ ఘటనపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## పాపం ఏ కష్టమొచ్చిందో.. ఈ హోంగార్డ్ జీవితం ఇలా ముగిసిపోయింది




హైదరాబాద్ పెన్ పవర్:ఆర్థిక ఇబ్బందులతో హోంగార్డ్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం (అక్టోబర్ 17, 2024) జరిగింది. ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంకట్ రెడ్డి నగర్‌లో నివాసం ఉండే హోం గార్డు వెంకట రమణయ్య(39) ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పంజాగుట్ట ఏసీపీ కార్యాలయంలో హోంగార్డు రమణ పని చేస్తున్నాడు.ఆర్థిక ఇబ్బందులే ఆత్మహత్యకు కారణమని పోలీసులు చెప్పారు. తెలంగాణలో 18 వేల మందికి పైగా హోంగార్డులు ఉండగా.. వారంతా సివిల్, ట్రాఫిక్ పోలీస్ డిపార్ట్‌మెంట్‌తో పాటు పలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో డిప్యుటేషన్‌పై విధులు నిర్వర్తిస్తున్నారు. పోలీస్ శాఖలోని పలువురు ఉన్నతాధికారుల ఇళ్లలోనూ పనిచేస్తున్నారు. హోంగార్డుల వేతనం నెలకు 28 వేల రూపాయలు.

## పదేళ్లలో తెలంగాణను నాశనం చేసిండు

- మొదటి పేజి తరువాయి

మండిపడ్డారు. పదేళ్లలో ఏడు లక్షల కోట్ల రూపాయల అప్పులు చేశారని.. ఇప్పుడు వాటికి నెలకు ఏడు వేల కోట్ల రూపాయల వడ్డీ చెల్లించాల్సి వస్తోందని తెలిపారు. గత ప్రభుత్వం చేసిన పాత అప్పులు కట్టడానికి ఇబ్బందులు పడుతున్నామని.. లేకపోతే ఇప్పటికే

అన్ని హామీలను అమలు చేసేవాళ్లని అన్నారు. వికారాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ యస్ రాజేష్ రెడ్డి 2024, అక్టోబర్ 17న ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య స్పీకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వికారాబాద్ జిల్లాలోని దామగుండంలో ఏర్పాటు చేయనున్న నేవీ రాడార్ స్టేషన్ కు గత బీఆర్ఎస్ ప్రభుత్వమే అన్ని పర్మిషన్లు ఇచ్చిందని స్పష్టం చేశారు. 2017లో జీవో నెం.44 ద్వారా పూడూరు మండలం దామగుండంలో నేవీ రాడర్ స్టేషన్ ఏర్పాటుకు బీఆర్ఎస్ సర్కార్ అనుమతులు మంజూరు చేసిందని గుర్తు చేశారు. ఇప్పుడేమో దామగుండం నేవీ రాడార్ స్టేషన్ నిర్మాణానికి వ్యతిరేకంగా అదే బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాళ్ల ప్రభుత్వ హయాంలో పర్మిషన్లు ఇచ్చి.. ఇప్పుడు వ్యతిరేకిస్తున్నారని మండిపడ్డారు.

# మాదిగల మహాసభలు,నిరసనలు, రథయాత్ర, బల ప్రదర్శనతో కాంగ్రెస్ కు కంటిమీద కునుకు లేకుండా చేస్తాం



హైదరాబాద్ పెన్ పవర్:కాంగ్రెస్ అధిష్టానానికి గాని, తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి సర్కార్ కు గాని ఎస్సీ వర్గీకరణ విషయంలో చిత్తశుద్ధి లేదని ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణ మాదిగ అన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు కేంద్రంలో గాని, ఇటు రాష్ట్రంలో గాని వేసిన కమిషన్లు వాటి సిఫార్సులు ఎక్కడికి పోయాయి? కాంగ్రెస్ ప్రభుత్వం కమిషన్లు వేస్తుంది కానీ కమిషన్ల సిఫార్సులు మాత్రం అమలు చేయదు. కాంగ్రెస్ ప్రభుత్వాల విషయాల్లో ఇలాంటి ఉదాహరణాలు కోకొల్లలుగా ఉన్నాయి. ఇప్పుడు రేవంత్ రెడ్డి సర్కారు వేసిన కమిషన్ కూడా నమ్మశక్యం కాదు అని మాదిగలు బలంగా నమ్ముతున్నాం. వర్గీకరణ చేపడితేరేవంత్ రెడ్డి తమ ప్రయోజనాలు పోల్పోతామన్న భయం లో ఉన్నారు. రేవంత్ రెడ్డి విషయంలో మాదిగలు వర్గీకరణ కోసం పోరాడాలి, మాలలు వర్గీకరణను అడ్డుకోవాలి అనే అంశంతో తమ స్వప్రయోజనాలను కాపాడుకునే కుట్ర కోణం దాగుందని అన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేపడితే మాదిగ మాలలు అందరూ కలిసి మళ్లీ ఒకసారి తమ ఉమ్మడి ప్రయోజనాల కోసం ఉద్యమిస్తారని భయం రేవంత్ రెడ్డి సర్కార్లో ఉంది. రేవంత్ రెడ్డి హామీలు ఇవ్వడంలో ఎంత దిట్టో ఆ హామీలను అమలు చేయకుండా మోసం చేయడంలో కూడా అంతకన్నా అందవేసిన చెయ్యి. కేంద్రంలో,రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీలో ఉన్న పెద్దలు, ఇక్కడ ఉన్న డబ్బు గల కొంతమంది నాయకులు,టీవీ చానల్స్ తమ డబ్బు అధికారాన్ని ఉపయోగించి వర్గీకరణ జరిగితే తమ ఉనికిని అధికారాన్ని కోల్పోతామన్న భయంతో వర్గీకరణ అంశాన్ని అడ్డుకుంటున్నారు. అందుకే ఎం ఆర్ పి ఎస్ ఆధ్వర్యంలో నిన్న నిజామాబాద్ కేంద్రంగా నిర్వహించిన మాదిగల కార్యాచరణ సమావేశం లో పలు అంశాలు చర్చించి మాదిగల భవిష్యత్తు కార్యాచరణను సోమాజిగూడ ప్రెస్ క్లబ్ వేదికగా ప్రకటిస్తున్నామని అన్నారు. నవంబర్ నెలలో మొదట మహాసభలు, తరువాత నిరసనలు, రథయాత్రతో 21తేదీ హైదరాబాద్ కేంద్రంగా మాదిగల మహాబల ప్రదర్శనను చేపడతాం. మాదిగల బల ప్రదర్శన ఏ రూపం తీసుకుంటుందో దానికి రేవంత్ రెడ్డి సర్కారు మాత్రమే బాధ్యత వహించాలని హెచ్చరిస్తున్నామని అన్నారు..

## ఉపా చట్టం రద్దు చేయాలి

హైదరాబాద్ పెన్ పవర్:ఉపా చట్టాన్ని రద్దు చేసి బేషరతుగా రాజకీయ ఖైదీలను విడుదల చేయాలని ప్రొఫెసర్ హర గోపాల్, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి డిమాండ్ చేసారు. హైదరాబాద్ సిపిఐ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద నల్ల దుస్తులను ధరించి నిరసన దీక్షకు దిగారు. ప్రొఫెసర్ హర గోపాల్, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ రాజకీయ నాయకులపై విచారణ లేకుండా ట్రైయల్లో మగ్గుతున్న ఖైదీలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేసారు. ప్రొఫెసర్ సాయిబాబా లాంటి వ్యక్తులను అత్యంత క్రూరమైన ఉపా చట్టనీ కింద అరెస్టు చేసి చివరివరకూ అక్కడే ఉంచుకోవడం ఎంతవరకు సమంజసం . భారత న్యాయ స్థానంలో సామాన్యుడికి న్యాయం ఎక్కడ దొరుకుతుందని ప్రశ్నించారు. ఉపా చట్టాన్ని రద్దు చేసేనీతవరకు ఊరుకోనేది లేదని అన్నారు.

## సోమవారం నుంచి ఫార్మా కళాశాలలు బంద్

హైదరాబాద్ పెన్ పవర్: కాంగ్రెస్ ప్రభుత్వం మళ్ళీ తమని మోసం చేస్తుందని ఫార్మ కళాశాల లో టీచర్స్ పెన్ డౌన్ చేస్తూ నిరసన వ్యం చేస్తున్నారని తెలంగాణ ఫార్మసీ కాలేజీ మేనేజ్మెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు టి జయపాల్ రెడ్డి అన్నారు హైదరాబాద్ ఫాతే? మైదాన లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ..... జీతాలు లేక ఉపాధ్యాయులు ఈఎంఐ కట్టలేక నానా ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు.మూడు సంవత్సరాలు గా పెండింగ్ లో ఉన్న బకాయలను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసి తమని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. దేశంలోనే అధికంగా ఫార్మసీ కళాశాలలు మన రాష్ట్రంలో ఉన్నాయని అన్నారు. వచ్చే సోమవారం నుండి కళాశాలలు బంద్ చేస్తున్నామని వెల్లడించారు.

## కొమురం భీం లేకపోతే.. ఇవాళ మనం ఉండేవాళ్లం కాదు: మంత్రి సీతక్క



హైదరాబాద్ పెన్ పవర్:కొమురం భీం జిల్లా: ఆదివాసీలకు ఆత్మగౌరవం, అస్తిత్వాన్ని కల్పించిన పోరాట యోధుడు కొమురం భీం అని.. ఆయన లేకపోతే ఇవాళ మనం ఉండకపోయేవాళ్లమని మంత్రి సీతక్క అన్నారు. కెరమెరి మండలం జోడేఘాట్ లో కొమురం భీం 84వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీతక్క మాట్లాడుతూ.. కొమురం భీం పోరాటంతోనే ఆదివాసీలకు హక్కులు సిద్ధించాయని కొనియాడారు. కొమురం భీం పోరాట స్ఫూర్తితో సాగిన పోరాటం వల్ల తెలంగాణ రాష్ట్రం వచ్చిందని గుర్తు చేశారు. ఆదివాసీల సమస్యల పరిష్కారానికి సీఎం రేవంత్ సానుకూలంగా ఉన్నారని సీతక్క తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక లక్ష 60 వేల ఎకరాల పోడు భూములకు పట్టాలు ఇచ్చామన్నారు. మరోవైపు ఫారెస్ట్ అధికారులకు మంత్రి సీతక్క వార్నింగ్ ఇచ్చారు. పోడు భూముల విషయంలో అత్యుత్సాహం చూపించొద్దని ఫారెస్ట్ అధికారులకు సూచించారు. ప్రజలపై దౌర్జన్యం చేస్తే ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. కొమురం భీం ప్రాజెక్టును అభివృద్ధి చేస్తామన్న సీతక్క.. ఇక్కడ రోడ్లు, ఇండ్లు, హాస్టల్ల అభివృద్ధికి మేము కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల నివేదిక రెడీ చేసి ఇవ్వాలని కలెక్టర్ మంత్రి సీతక్క ఆదేశించారు. త్వరలో సీఎం రేవంత్ రెడ్డి జోడే ఘాట్ వస్తారని.. జోడేఘాట్ ప్రాంతంలో టూరిజం అభివృద్ధి చేస్తామన్నారు. రాష్ట్రంలో కుల గణన జరుగుతోందని.. అధికారులకు మీ సమాచారం ఇవ్వాలని.. సబ్ క్యాస్ట్ చెప్పుకోవాలని ఆదివాసీలకు సూచించారు. ఆదివాళ్ళ జోలికి వస్తే ఎవ్వరిని వదిలిపెట్టేది లేదని.. మేం వెంటే ఉంటామని భరోసా కల్పించారు. ఇది మీ ప్రభుత్వం.. మీ మనుషులమని అన్నారు.

## రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య



హైదరాబాద్ పెన్ పవర్: రైలు బండి కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఏలూరు నగరంలోని సత్రంపాడు రైల్వే వంతెన క్రింద చోటుచేసుకుంది ఏలూరు నగరంలోని సత్రంపాడు రైల్వే అండర్పాస్ వంతెన సమీపంలో తిరుపతి నుండి కాకినాడ వెళ్లే రైలు బండి కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డారు. అతని వయసు 35 నుండి 40 సంవత్సరాల మధ్య ఉంటుందని రైల్వే పోలీసులు అంచనా వేస్తున్నారు. మృతుని ఎత్తు ఐదు అడుగుల 5 అంగుళాలు కాగా నలుపు రంగు జుట్టు సామాన్య దేహదారు కలిగి ఉన్నాడు గచ్చకాయ రంగు పొట్టి చేతుల చొక్కా నీళ్ల రంగు లోయర్ ధరించి ఉన్నాడు. సమాచారం అందుకున్న రైల్వే ఎస్సై సైమన్ ఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన పత్రిక తరలించారు. వివరాలు తెలిసినవారు ఏలూరు రైల్వే ఎస్సై సైమన్ సంప్రదించాలని సూచించారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

## కుళ్లిపోయిన స్థితిలో యాచకురాలి మృతదేహం లభ్యం

హైదరాబాద్ పెన్ పవర్: రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని నాదర్గుల్ దుర్గమాత గుడి సమీపంలోని పార్వతీపురం ప్యారం ఆశ్రమం వెనకు కుళ్లిన పోయిన స్థితిలో గుర్తుతెలియని యాచకురాలు (55) మృతదేహం లభ్యం అయింది.

## ఇషా ఫౌండేషన్ లో చిన్నారులపై వేధింపులు

హైదరాబాద్ పెన్ పవర్: అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన ఇషా ఫౌండేషన్ ఆధ్యాత్మికత ముసుగులో చిన్నారులపై వేధింపులకు పాల్పడే వారి పెంపకానికి కేంద్రంగా నిలుస్తుంది అని మాజీ అధ్యాపకులు యామిని రాగానే తెలిపారు. హైదరాబాద్ బషీర్బాగ్ ప్రెస్ క్లబ్లు లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.... ఆశ్రమ నిర్వాహకులు నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగాగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఉష ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలలు.. విష విద్య ఇషా ఉష సంస్కృతి ఇషా నిషా హోమ్ స్కూల్లో 8,000 మంది పైగా విద్యార్థులు న్నారని తెలిపారు. ఉషా సెంటర్లో విద్యా కార్యక్రమాల పేరుతో ఇషా సంస్కృతికి చెందిన బాలికలను అత్యధిక దీక్షలకు గురి చేస్తున్నారని ఆరోపించారు. పాఠశాలలో ఎనిమిదేళ్ల బాలికపై పలుమార్లు అత్యాచారం జరిగినప్పుడు బయటకు రాకుండా మౌనం వహించారని వారు తెలిపారు. ఉష ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సద్గురు తాను సాక్షాత్‌పరమైన ఆత్మ అని మరియు కరుణతో నిండి ఉన్నాడని ఇషా సంస్కృతి మరియు ఇషా విద్యార్థులపై జరుగుతున్న అకృత్యాలపై ఎప్పుడు నోరు విప్పడం లేదని తెలిపారు. 12వ తరగతి చదువుతున్న ఆలైడి మరణం యజమానియం నిర్లక్ష్యం వల్లే జరిగిందని వివరించారు. ఇషా ఫౌండేషన్ ఇషా ఎడ్యుకేషన్ చేస్తున్న ఈ దురాగతాలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు

## అరుదైన తెల్లపులి, మొసళ్లను తరలిస్తుండగా వాహనం బోల్తా.. తప్పించుకునే ప్రయత్నం చేసిన మొసళ్లు




**హైదరాబాద్ పెన్ పవర్:**బీహార్ రాజధాని పాట్నాలోని సంజయ్‌గాంధీ జాతీయ పార్క్ నుంచి రెండు వాహనాల్లో అరుదైన తెల్లపులి, మొసళ్లను తరలిస్తున్న వాహనం బోల్తాపడింది. బెంగళూరులోని బన్నేరుఘట్ట జాతీయ జూపార్క్‌కు వెళ్తున్న వాహనాల్లో ఒకటి తెలంగాణలోని నిర్మల్ జిల్లా మామడ మండలం మొండిగుట్ట గ్రామం వద్ద నిన్న అదుపుతప్పి బోల్తాపడింది.
దీంతో వాహనంలోని 8 మొసళ్లలో రెండు బయటపడి తప్పించుకునే ప్రయత్నం చేశాయి. అది చూసిన స్థానికులు భయంతో పరుగులు తీశారు. సమాచారం అందుకున్న స్థానిక అటవీశాఖ అధికారులు వెంటనే అక్కడికి చేరుకుని మొసళ్లను బంధించారు. మరో వాహనాన్ని సిద్ధం చేసి బెంగళూరు తరలించారు.

## హైడ్రా తరహాలో.. హైదరాబాద్‌లో ఫుట్‌పాత్‌లపై షాపులు నేలమట్టం



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరబాద్ లోని నాలాలు, చెరువులను కబ్జాచేసి కట్టిన అక్రమ నిర్మాలను హైడ్రా కూల్చివేస్తుంటే.. రోడ్లపై ఫుట్‌పాత్‌లను అక్రమించి కట్టిన షాప్ లను, షెడ్లను ట్రాఫిక్ పోలీసులు కూల్చివేస్తున్నారు. మోండా మార్కెట్ లో ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా సేద స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రోడ్లపై ఫుట్‌పాత్‌లను ఆక్రమించి దుకాణాలు నిర్వహిస్తున్న షెడ్లను ట్రాఫిక్ డిసిపి రాహుల్ హెగ్డే ఆధ్వర్యంలో కూల్చివేశారు. మార్కెట్‌లో తిరిగే పాదాచారులకు.. ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని ఫుట్‌పాత్‌లపై ఉన్న షాప్ లను కూల్చివేశారు. పబ్లిక్ నుంచి ఫిర్యాదులు రావడంతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించామని.. ఇకనుంచి ప్రతి రోజూ అధికారుల పర్యవేక్షణ ఉంటుందని డిసిపి రాహుల్ హెగ్డే అన్నారు.

# 10 నెలలు... 25 సార్లు ఢిల్లీ పర్యటనలు... అయిననూ పోయిరావలె!

- రూపాయి లాభం లేకున్నా ఢిల్లీ పర్యటనలు సిల్వర్ జూబ్లీ చేసుకున్నాయని ఎద్దేవా
- రాష్ట్రంలో తట్ట మట్టి తీసింది లేదు... కొత్తగా చేసింది అసలే లేదని విమర్శ
- మూసీ, హైడ్రా పేరుతో పేదోళ్ల పొట్టలు కొడుతున్నారని ఆగ్రహం





**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు గుప్పించారు. పైసా పని లేకున్నా... రాష్ట్రానికి రూపాయి లాభం లేకున్నా సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలు మాత్రం సిల్వర్ జూబ్లీ చేసుకున్నాయని ఎద్దేవా చేశారు. ఈ మేరకు 'అయిననూ పోయి రావలె హస్తినకు' అంటూ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. 10 నెలల కాలంలో 25 సార్లు ఢిల్లీకి వెళ్లారని, 50 రోజులు దేశ రాజధానిలో పర్యటించారని పేర్కొన్నారు. పోను 25 సార్లు, రాను 25 సార్లు... ఢిల్లీ పెద్దల చుట్టూ ప్రదక్షిణలు చేసి సిల్వర్ జూబ్లీ కూడా చేశావని రేవంత్ రెడ్డిని ఉద్దేశించి పేర్కొన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో తట్ట మట్టి తీసింది లేదని, కొత్తగా చేసింది అసలే లేదని విమర్శించారు.
"అన్నదాతల అరిగోసలు... గాల్లో దీపాల్లా గురుకులాలు... కుంటుపడ్డ వైద్యం... గాడి తప్పిన విద్యా వ్యవస్థ... అయిననూ పోయి రావలె హస్తినకు" అని చురక అంటించారు. "మూసీ పేరుతో, హైడ్రా పేరుతో పేదోళ్ల పొట్టలు కొట్టి, 420 హామీలను మడతపెట్టి మూలకు వేసి.. అయినను పోయి రావాలె హస్తినకు" అని వ్యంగ్యం ప్రదర్శించారు. పండగలు పండగల్లా లేవు... ఆడబిడ్డల చీరలు అందనేలేదు... అవ్వాతాతలు అనుకున్న పెన్షన్ రాలేదు... తులం బంగారం జాడనే లేదు... స్కూటీలు లేవు, కుట్టు మిషిన్లు లేవని విమర్శించారు.

**ఇందిరమ్మ రాజ్యంలో ఇసుకాసురుల ఇష్టారాజ్యం..!**

ఇందిరమ్మ రాజ్యంలో ఇసుకాసురులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని కేటీఆర్ మరో ట్వీట్ చేశారు. కాంగ్రెస్ పాలన శాండ్ మాఫియాకు అభయ హస్తంగా మారిందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ఏ మూలన చూసినా విచ్చలవిడిగా ఇసుక దందాలు కనిపిస్తున్నాయన్నారు. బడా ఛోటా తేడా లేదు... మంత్రుల నుంచి మండలస్థాయి లీడర్ల వరకు ఇసుకను పిండి దండిగా ధనాన్ని దండుకుంటున్నారని పేర్కొన్నారు.
అధికారులకు మామూళ్లు ఇచ్చి మచ్చిక చేసుకుంటుంటే... ఇక అడ్డగోలు తవ్వకాలను... అక్రమ రవాణాను అడ్డుకునేది ఎవరు? అని ప్రశ్నించారు. నదులను... వాగులను... వంకలను కొల్లగొట్టి ఖజానాకు చేరాల్సిన సొమ్మును కాంగ్రెస్ వాళ్లు తమ జేబులు నింపుకుంటున్నారని ఆరోపించారు. అధికార పార్టీ నేతల అండదండలతో అనధికార తవ్వకాలతో యథేచ్ఛగా అడ్డూ అదుపూలేని ఇసుక దోపిడి సాగుతోందన్నారు.

# మూసీ టెండర్ అగ్రిమెంట్ రూ.141 కోట్లు మాత్రమే: సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్ పెన్ పవర్:**మూసీ నది పునర్జీవనం కోసం 141 కోట్ల రూపాయలతో ఒప్పందం చేసుకున్నట్లు స్పష్టం చేశారు సీఎం రేవంత్ రెడ్డి. ప్రపంచంలోని ఐదు బెస్ట్ కంపెనీలను డీపీఆర్ ( డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్) సిద్ధం చేయమని చెప్పినట్లు వెల్లడించారాయన. మూసీపై ప్రతిపక్షాలు తప్పుడు మాటలు మాట్లాడుతున్నాయని.. తప్పుడు వార్తలను ప్రచారం చేస్తున్నాయంటూ బీఆర్ఎస్ పార్టీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారాయన. మూసీ కోసం లక్షా 50 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు తప్పుడు ప్రచారాన్ని చేస్తున్నారంటూ మండిపడ్డారు సీఎం రేవంత్ రెడ్డి.
మూసీ నది పునర్జీవనం విషయంలో.. పెట్టుబడుల ఆహ్వానం, రుణాల సేకరణ, వంటి అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి.. గ్రౌండ్ రియాల్టీని అంచనా వేయటానికి ఐదు కంపెనీలను ఎంపిక చేసినట్లు వెల్లడించారాయన. ఈ ఐదు కంపెనీలు గ్లోబల్ సమ్మిట్స్, సెమినార్లు వివిధ దేశాలు నిర్వహించి.. పారిశ్రామికవేత్తలను హైదరాబాద్ తీసుకురావటానికి.. పెట్టుబడులు పెట్టటానికి.. ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా సహాయ సహకారాలు అందిస్తాయని వెల్లడించారాయన.
ఈ ఐదు కంపెనీలు.. ప్రాజెక్టు రిపోర్ట్ పై నిరంతరం సలహాలు, సూచనలు ఇవ్వటానికి 18 నెలలు పని చేస్తాయని.. ఆ తర్వాత మూసీ నది పునర్జీవనం ప్రాజెక్టు కంప్లీట్ అయ్యే వరకు..





మరో ఐదు సంవత్సరాలు పని చేస్తాయన్నారు.
హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్. మూసీ పునర్జీవం తర్వాత వచ్చే పెట్టుబడులు, నిధుల సేకరణ వంటి అన్ని అంశాలపై ప్రభుత్వానికి తమ సలహాలు, సూచనలు ఇవ్వటంతోపాటు.. పారిశ్రామికవేత్తలు.. ప్రభుత్వం మధ్య సంధానకర్తగా వ్యవహరిస్తాయని వివరించారు సీఎం రేవంత్ రెడ్డి. ఈ ఐదు కంపెనీలకు టెండర్ అగ్రిమెంట్ కింద 141 కోట్ల రూపాయలతో ఒప్పందం చేసుకున్నట్లు వివరించారు. ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నట్లు లక్షా 50 వేల కోట్ల రూపాయలు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారాయన.

# రాడార్ సెంటర్‌కు అనుమతులు ఇచ్చిందే కేసీఆర్ సర్కార్




**హైదరాబాద్ పెన్ పవర్:**రాడార్ స్టేషన్ నిర్మాణానికి అనుమతులు ఇచ్చిందే బీఆర్ఎస్ అని సీఎం రేవంత్ రెడ్డి ప్రెస్‌మీట్‌లో చెప్పారు. వాళ్లు దిగిపోయే నాటికి అన్ని పర్మిషన్లు తీసుకున్నారని తెలిపారు. దేశ భద్రతను కూడా రాజకీయాలకు ముడిపెడుతున్నారని ఆయన దుయ్యబట్టారు. దేశ భద్రతను వ్యతిరేకిస్తే వాడు కసబ్ కంటే హీనుడు అని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. లక్షల ఎకరాలు కాలుష్యం చేయాలని చూసిన వాళ్లు రాడార్ సెంటర్ గురించి మాట్లాడుతున్నారని రేవంత్ ఎద్దేవా చేశారు. దేశ ప్రయోజనాల కోసం పెట్టే ప్రాజెక్టును ఎలా అడ్డుకుంటామని ఆయన ప్రశ్నించారు. 12 లక్షల చెట్లు పోతున్నాయని తప్పుడు ప్రచారం చేస్తున్నారని.. వందలు, వేలల్లోనే చెట్లు పోతున్నాయని సీఎం చెప్పారు. ఆ చెట్లకు ఐదింతలు మొక్కలు నాటుతారని తెలిపారు.

వికారాబాద్ జిల్లా పూడూరు మండలంలోని దామగుండం అటవీ ప్రాంతంలో నేవీ రాడార్ కేంద్రానికి కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే. దేశంలోనే రెండో వీఎల్ఎఫ్ కమ్యూనికేషన్ స్టేషన్ ను నేవీ ఇక్కడ నెలకొల్పుతోంది. నౌకలు, జలాంతర్గాములతో సంభాషించేందుకు నావికా దళం వీఎల్ఎఫ్ (వెరీ లో ఫ్రీక్వెన్సీ) కమ్యూనికేషన్ ట్రాన్స్ మిషన్ స్టేషన్‌ను ఉపయోగిస్తుంది. నేవీ రాడార్‌కు సంబంధించి దేశంలోనే ఇది రెండో స్టేషన్.

తమిళనాడులోని తిరునెల్వేలిలో ఉన్న ఐఎన్ఎస్ కట్టబొమ్మన్ రాడార్ స్టేషన్ మొదటిది. 1990 నుంచి అది నావికా దళానికి సేవలందిస్తోంది.

రెండో రాడార్ స్టేషన్

ఏర్పాటుకు తెలంగాణ అనువైన ప్రాంతంగా విశాఖపట్నంలోని తూర్పు నౌకాదళ కమాండ్ ఇప్పటికే గుర్తించింది. 2010 నుంచి నావికా దళం రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతోంది. పర్యావరణ అనుమతులు, క్లియరెన్స్ లు వచ్చినప్పటికీ.. గత ప్రభుత్వం భూముల కేటాయించలేదు.

ఈ ఏడాది జనవరిలో కమోడోర్ కార్తీక్ శంకర్, సర్కిల్ డీఈవో రోహిత్ భూపతి, కెప్టెన్ సందీప్ దాస్ సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. అనంతరం వికారాబాద్ డీఎఫ్ వో, నావల్ కమాండ్ ఏజెన్సీ అధికారులు అటవీ భూముల బదిలీ ఒప్పందంపై సంతకాలు చేశారు. దామగూడెం రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో ఉన్న 1,174 హెక్టార్ల అటవీ భూమిని నేవీకి అప్పగించారు. దీంతో సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో ఈ ప్రాజెక్టుకు ఉన్న అడ్డంకులన్నీ తొలగిపోయాయి.

# చెన్నైలో భారీ వర్షాలు.. విలాసవంతమైన హోటళ్లకు మకాం మారుస్తున్న ధనవంతులు

- చెన్నైలో కుండపోత వర్షాలు
- ముందు జాగ్రత్తగా హోటళ్లకు క్యూకడుతున్న ధనవంతులు, ఐటీ నిపుణులు
- గతేడాది చివరలో భారీ వర్షాలు ముంచెత్తడంతో భీకర దృశ్యాలు
- ఈ నేపథ్యంలో చెన్నైవాసుల జాగ్రత్తలు



**హైదరాబాద్ పెన్ పవర్:**తమిళనాడు రాజధాని నగరం చెన్నైలో కుండపోత వర్షాలు కురుస్తుండడంతో అక్కడి ప్రజల్లో భయం నెలకొంది. గతం తాలూకు ఘటనల నేపథ్యంలో ప్రత్యేకించి ధనవంతులు, ఐటీ నిపుణులు, ఇతర రంగాలకు చెందిన ప్రముఖులు ముందు జాగ్రత్తగా విలాసవంతమైన హోటళ్లకు మకాం మారుస్తున్నట్లు తెలుస్తోంది. పెద్దపెద్ద హోటళ్లలో గదులు బుక్ చేసుకుని ఫ్యామిలీలతో కలిసి దిగిపోతున్నారట. గతేడాది చివరలో ఒక్కసారిగా భారీ వర్షాలు ముంచెత్తడంతో వరద నీటిలో వాహనాలు కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. అలాగే ఇళ్లు జలమయం అయ్యాయి. ఈ నేపథ్యంలోనే ఈసారి అలా జరగకుండా ముందు జాగ్రత్తగా ధనవంతులు విలాసవంతమైన హోటళ్లలో దిగుతున్నట్లు సమాచారం.

వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక వసతి, విద్యుత్, తాగునీరు, వైఫై తదితర సౌకర్యాలు ఉండేలా చూడాలనే షరతులతో గదుల్లో దిగుతున్నట్లు తెలుస్తోంది. బుధవారం భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందంటూ రెడ్ అలర్ట్ ఇచ్చినా సాయంత్రం వరకు తేలికపాటి వర్షమే పడడంతో నగర ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఇక ఈరోజు చెన్నైకి భారీ నుంచి అతిభారీ వర్షసూచన చేసింది వాతావరణ శాఖ.

అటు బెంగళూరులోనూ కుంభవృష్టి కారణంగా జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. మైసూరు, మంగళూరు, కోలారు, చిత్రదుర్గ, చిక్కబళ్లాపురం, రామనగర, ఉడుపి తదితర జిల్లాల్లోనూ కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. నగరంలోని పలు లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి వరద నీరు చేరడంతో ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు.

## ఈసారి ఫ్రాంక్‌ఫర్ట్-ముంబై విస్తారా విమానానికి బెదిరింపు.. నాలుగు రోజుల్లో 13వ ఘటన




**హైదరాబాద్ పెన్ పవర్:** భారతీయ విమానాలకు బెదిరింపులు కొనసాగుతున్నాయి. తాజాగా ఫ్రాంక్‌ఫర్ట్ నుంచి ముంబైకి వెళ్తున్న విస్తారా విమానానికి సోషల్ మీడియా ద్వారా బెదిరింపు వచ్చింది. దీంతో విమానాన్ని ముంబైలోని చత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ల్యాండ్ చేసి ఐసోలేషన్‌కు తరలించి తనఖీలు చేస్తున్నారు. గత నాలుగు రోజుల్లో ఇది 13వ బెదిరింపు కావడం గమనార్హం.వరుస బెదిరింపుల కారణంగా విమాన సర్వీసులకు అంతరాయం ఏర్పడింది. ఇప్పటికే ఎయిర్ ఇండియా, ఇండిగో, ఆకాశ విమానాలకు బెదిరింపులు ఎదురయ్యాయి. తాజా ఘటనలో తాజా విమానం యూకే 028లోని ప్రయాణికులందరూ క్షేమంగా ఉన్నట్టు విస్తారా అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు.

## మంత్రి కొండా సురేఖ వివాదాస్పద వ్యాఖ్యలపై మళ్లీ స్పందించిన సమంత



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ మంత్రి కొండా సురేఖ తనను ఉద్దేశించి ఇటీవల చేసిన వ్యాఖ్యలపై టాలీవుడ్ నటి సమంత మరోమారు స్పందించారు. తన చుట్టూ ఉన్నవారి నమ్మకం వల్లే సమస్యలను ఎదుర్కోగలిగానని చెప్పారు. తన తాజా వెబ్ సిరీస్ 'సిటాడెల్: హనీ బన్ని' ప్రమోషన్‌లో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో సమంత పలు విషయాలను పంచుకున్నారు.

ఈ సందర్భంగా ఓ విలేకరి మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలను ప్రస్తావించారు. దీనిపై స్పందించిన సమంత.. ఈ రోజు తానిక్కడ కూర్చునేందుకు ఎంతోమంది మద్దతు ఉందని చెప్పారు. ఇండస్ట్రీలోని ప్రముఖుల ప్రేమ, తనపై వారికున్న నమ్మకమే తనను ఈ స్థాయిలో నిలబెట్టాయని పేర్కొన్నారు. వారు తన వైపు నిలబడకుంటే కష్టాలను ఎదుర్కొనేందుకు తనకు మరింత సమయం పట్టేదని చెప్పారు. ఆన్‌లైన్ ట్రోలింగ్‌పై మాట్లాడుతూ.. ద్వేషపూరిత సందేశాలు వచ్చినప్పుడు వాటి ప్రభావం తనపై పడకుండా చూసుకుంటానని వివరించారు.సిటాడెల్ సిరీస్ కోసం దర్శకులు తనను సంప్రదించినప్పుడు తాను చేయలేనని చెప్పానని గుర్తు చేసుకున్నారు. అంతేకాదు, తనను అనుకున్న పాత్రకు సరిపోయే నలుగురు హీరోయిన్ల పేర్లను కూడా రాజ్ అండ్ డీకేకు సిఫార్సు చేసినట్టు తెలిపారు. తాను చేయలేనని చెబుతున్నప్పటికీ వినకుండా పట్టుబట్టి మరీ తనతో ఆ పాత్రను చేయించారని పేర్కొన్నారు. తాను వద్దన్నా మరొకరిని తీసుకోకుండా తనతోనే ఆ పాత్ర చేయించడం తన అదృష్టమని సమంత చెప్పుకొచ్చారు. ఈ సిరీస్‌లో ఆమె స్పై ఏజెంట్‌గా నటించారు. సమంత, వరుణ్ ధావన్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సిరీస్ వచ్చే నెల 7 నుంచి అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ కానుంది.

## కమాన్ పూర్ లయన్స్ క్లబ్ కు ఎల్వీ ప్రసాద్ అవార్డు.



**హైదరాబాద్ పెన్ పవర్:**కమాన్ పూర్ లయన్స్ క్లబ్ కు ఎల్ వి ప్రసాద్ అవార్డు అందజేశారు. ఎల్ వి ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ 50వేల కార్నియాలు మార్పిడి చేసి ప్రపంచంలోనే మొదటి సంస్థగా రికార్డ్ సృష్టించిన హైదరాబాద్ లోని ఎల్వి ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ వారు ప్రత్యేక సెమినార్ను నిర్వహించారు. అలాగే నేత్రదానం కు ముందుండి కృషిచేసిన సదాశయ ఫౌండేషన్ ,కమాన్ పూర్ లయన్స్ క్లబ్ కు సంస్థ వ్యవస్థాపకులు గుండ్లపల్లి నాగేశ్వరరావు లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శంకర్ కు సదాశయ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రావణ్ కుమార్ కు మరియు ప్రధాన కార్యదర్శి లింగమూర్తిలకు ఈ అవార్డును అందజేశారు. కాగా ఈ కార్యక్రమంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు పాల్గొని ఎల్వి ప్రసాద్ బృందాన్ని అభినందించారు. అలాగే ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ సలహాదారు కెవిపి రామచంద్రరావు మాజీ ఐఏఎస్ జయప్రకాష్ నారాయణ పాల్గొన్నారు. కమాన్ పూర్ క్లబ్ ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో కళ్ళు ఎల్వి ప్రసాద్ ల్యాప్ కు పంపడంతో గుర్తించి అవార్డును అందజేశారు. తమ క్లబ్ ను గుర్తించినందుకు లైన్స్ క్లబ్ అధ్యక్షుడు సాన రామకృష్ణారెడ్డి నల్లవెల్లి శంకర్ భీష్మ చారి వాసు శ్రవణ్ కుమార్ లింగమూర్తి అనంతరాములు చంద్రమౌళి ఎల్వి ప్రసాద్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు.

## వ్యవసాయంపై అవగాహన ఉన్న వారికి ఏ ఎం సి చైర్మన్ పదవి ఇవ్వాలి

### గెలుపు కోసం కష్టపడ్డ వారిని గుర్తించాలి...

### ఏఎంసీ ప్రకటనలో జాప్యం ఎందుకు...

**హైదరాబాద్ పెన్ పవర్:** కమాన్ పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి వ్యవసాయంపై అవగాహన ఉన్నవారికి ఇవ్వాలని పలువురు కాంగ్రెస్ నాయకులు కోరుతున్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి శ్రీధర్ బాబు గెలుపులో ప్రముఖ పాత్ర వహించిన వారికే ఈ పదవి అప్పగించాలని గుసగుసలు విన వస్తున్నాయి. అలాగే సుమారు పెద్దపల్లి జిల్లాలో రెండు మార్కెట్ కమిటీ లు మంథని మరియు కమాన్ పూర్ మాత్రమే ప్రకటించాల్సి ఉంది. కమాన్ పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి తీవ్ర పోటీ నెలకొంది. ఈ పదవి కోసం చాలామంది ఆశావాహులు చైర్మన్ పదవిని ఆశిస్తున్నారు. ముఖ్యంగా ఇందులో రామగిరి ముత్తారం కమాన్ పూర్ మండలాల నుండి నాయకులు తమకే వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఈ చైర్మన్ పదవి కోసం మండల కేంద్రానికి చెందిన బీసీ నాయకుడు పెద్ద ఎత్తున పావులు కదిలిస్తున్నాడు. అలాగే ఈసారి స్థానికులకు ఇవ్వాలని బలంగా వినబస్తోంది. అలాగే పట్టణాలకే పరిమితమై వ్యాపారాల్లో నిమగ్నమయ్యే వ్యక్తులకు కాకుండా స్థానికంగా ఉండే నాయకులకు అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు కోరుతున్నారు. కాంగ్రెస్ నాయకులతోపాటు సీనియర్ పాత్రికేయునికి సైతం మంత్రి ఆశీస్సులు ఉన్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా ఈసారి కమాన్ పూర్ స్థానికులకే ఇవ్వాలనే వాదన బలంగా వినవస్తోంది. మండల కేంద్రానికి చెందిన బిసి నాయకునికి ఇవ్వడం సభబేనని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

# ఏపీలో భారీ వర్షాలు.. విశాఖ, కాకినాడ తీరాల్లో భయపెడుతున్న రాకాసి అలలు

- తడ వద్ద తీరం దాటిన వాయుగుండం
- భారీ వర్షాలతో పలు జిల్లాలు అతలాకుతలం
- శ్రీ సత్యసాయి జిల్లాలో ఉధృతంగా ప్రవహిస్తున్న చిత్రావతి
- పలు గ్రామాలకు నిలిచిపోయిన రాకపోకలు
- తీరంలో భయపెడుతున్న రాకాసి అలలు
- వర్షాలపై కలెక్టర్లతో చంద్రబాబు సమీక్ష



**హైదరాబాద్ పెన్ పవర్:**వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలు ఏపీ ప్రజలను మరోమారు భయం గుప్పిట్లోకి నెట్టాయి. రాయలసీమ సహా పలు జిల్లాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా జనజీవనం స్తంభించింది. విశాఖ, కాకినాడ తీరాల్లో పెద్ద ఎత్తున ఎగసిపడుతున్న అలలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. విశాఖ ఆర్కేబీచ్ వద్ద అలలు భీకర శబ్దంతో దుకాణాల వరకు వచ్చి తాకుతున్నాయి. కాకినాడ జిల్లా ఉప్పాడ వద్ద సముద్రం అల్లకల్లోలంగా మారింది. తీరంలో రాకాసి అలలు ఎగసిపడుతున్నాయి. చెట్లు, విద్యుత్తు స్తంభాలతోపాటు పలు ఇళ్లు నేలమట్టమయ్యాయి. అంతర్వేదిలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. కోనసీమ జిల్లాలోని ఓడలరేవు తీరంలో అలలు ఉధృతంగా ఎగసిపడుతున్నాయి. గత ఆరు గంటలుగా 22 కిలోమీటర్ల వేగంతో కదిలిన వాయుగుండం తిరుపతి జిల్లా తడ వద్ద తీరం దాటింది. అనంతరం అల్పపీడనంగా బలహీన పడింది. భారీ వర్షాల నేపథ్యంలో శ్రీసత్యసాయి జిల్లా సీకేపల్లి మండలం వెల్దుర్తి సమీపంలోని చిత్రావతి వద్ద నది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఫలితంగా పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వర్షాలు ముంచెత్తుతుండడంతో కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమీక్ష నిర్వహించారు.

# యాదగిరిగుట్టకు వచ్చేనెయ్యి స్వచ్ఛమైనది..... ఆలయ ఈవో

**యాదాద్రి పెన్ పవర్::** యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రసాదంలో వాడే నెయ్యి నాణ్యత బాగుందని ఫుడ్ సేఫ్టీ అధికారులు సర్టిఫికెట్ ఇచ్చారని ఆలయ ఈవో భాస్కరరావు తెలిపారు.. యాదాద్రి కొండపై తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పలు విష యాలను వివరించారు. యాదాద్రీశుడి ప్రసాదంలో వినియోగించే నెయ్యిని పరిశీలించేందుకు ఇటీవల షాంపిల్స్ తీసుకెళ్లారని, వాటిని పరిశీలించిన తరువాత నాణ్యత బాగుందని అధికారులు వెల్లడించారని ఆయన పేర్కొ న్నారు. లడ్డూ తయారీతో పాటు ఇతర ప్రసాదాలకు ప్రతి రోజు వెయ్యి కిలోల నెయ్యిని వాడుతున్నామన్నారు. సంవ త్సరానికి రూ.15 కోట్ల విలువైన నెయ్యిని మదర్ డెయిరీ ద్వారా కొనుగోలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మదర్ డెయిరీ నుంచి 40 సంవత్సరాలుగా నెయ్యిని టెండర్ ధరల ప్రకారమే కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. నెయ్యి శాంపిలన్ను ప్రతి నెల పరీక్షలకు పంపుతామన్నారు. మదర్ డెయిరీ



ద్వారా నెయ్యి కొనుగోలు టెండర్ వచ్చే సంవత్సరం మార్చి 31 వరకు గడువు ఉందని, కానీ, ప్రభుత్వం విజయ డెయిరీ నుంచి నెయ్యిని వాడాలని ఆదేశించిందని చెప్పారు. విజయ డెయిరీ నెయ్యిని వాడాలా.. మదర్ డెయిరీ నెయ్యి వాడాలా అనే అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు..

# బీహెచ్ఈఎల్ అధికారులతో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి భేటీ

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రజల సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనుల విషయంలో సంపూర్ణ సహకారం అందించాలని బిహెచ్ఇఎల్ పరిశ్రమ ఉన్నతాధికారులను పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. బిహెచ్ఎల్ పరిశ్రమ ఈడి భరణి రాజాతో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి సమావేశమయ్యారు. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ప్రజా సమస్యల పరిష్కారంలో బిహెచ్ఇఎల్ ఎస్టేట్ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని ఈడి దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా.. మున్సిపల్ పరిధిలోని ఎం ఐ జి 2 పరిధిలో అంతర్గత మురుగునీటి కాలువ నిర్మాణ పనులకు, ఎం ఐ జి 2 ముఖ ద్వారం నుండి అన్నమయ్య కాలనీ మీదుగా బి మ్యక్ వరకు గల రహదారిని మూసివేశారని వెంటనే ప్రారంభించాలని, అంతర్గత రహదారుల మరమ్మత్తు పనులకు అనుమతించాలని కోరారు. ఎస్టేట్ అధికారుల అభ్యంతరాల మూలంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడంతోపాటు.. అభివృద్ధికి నోచుకోవడం లేదని తెలిపారు. ఎందుకు సానుకూలంగా స్పందించిన బెల్ ఈడి.. త్వరలోనే సమస్యల పరిష్కారానికి సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో తెల్లాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ రాములు గౌడ్, కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు మల్లేపల్లి సోమిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# మిల్లర్లే కొంటున్నారు పచ్చి వడ్లకు క్వింటాల్ కు రూ.2,200 చెల్లింపు.



**హైదరాబాద్ పెన్ పవర్:** జిల్లాలో వరి పంట కోతలు మొదలై 20 రోజులు దాటింది. ఇంకా సర్కార్ కొనుగోలు కేంద్రాలు ప్రారంభంకాకపోయినా, మిల్లర్లే నేరుగా కల్లాల మీదకు వచ్చి జోరుగా ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. ఖరీఫ్ వచ్చిన వడ్లలో ఇప్పటికే 35 శాతం వరకు కొన్నట్టు తెలుస్తోంది. కల్లాల వద్దకు ఏజెంట్ల సహాయంతో చేరుకొని సన్నాలు, దొడ్డురకం తేడాలేకుండా పచ్చివడ్లను క్వింటాల్కు రూ.2,200 ధరకు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వ మద్దతు ధరకు దాదాపు సమానంగా మిల్లర్లు రేట్ఇస్తుండడంతో రైతులు వారివైపే మొగ్గుచూపుతున్నారు. సన్న వడ్లకు ఈ సీజన్ నుంచి క్వింటాల్కు రూ.500 చొప్పున బోనస్ ఇవ్వాలని పాలకులు నిర్ణయించారు. కానీ, మిల్లర్ల కల్లాల దగ్గరే కొంటుండంతో రైతులు ముందుగానే అమ్మేసుకుంటున్నారు. దీంతో వారు బోనస్ నష్టపోవాల్సి వస్తోంది.

**వరుసగా మూడో సీజన్:**

జిల్లాలో సాగు భూమి విస్తీర్ణం 5.53 లక్షల ఎకరాలుకాగా రెండేండ్ల నుంచి వరిసాగు అనూహ్యంగా పెరిగింది. ప్రస్తుత ఖరీఫ్లో రికార్డు స్థాయిలో 4.30 లక్షల ఎకరాలలో వరి పంట వేశారు. అందులో సన్నరకం వరి పంట 4.02 లక్షల ఎకరాలు కాగా, కేవలం 28 వేల ఎకరాలలో మాత్రమే దొడ్డురకం పంట ఉంది. ఏ, గ్రేడ్ వడ్లకు ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్ కు రూ.2,320, కామన్ రకం సన్నాలకు రూ.2,300 రేట్ కొనసాగుతోంది. మద్దతు ధరకు అదనంగా రూ.500 బోనస్ ప్రకటించింది. వెరసి క్వింటాలడ్లకు కలిపి మొత్తం రూ.2,800 రేట్ దక్కే అవకాశం ఉండటంతో జిల్లా రైతులు ఈసారి సన్న రకం వరి సాగు చేశారు.

అయితే 2023--24 ఖరీఫ్, యాసంగిలో కర్నాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల మిల్లర్లు జిల్లాలో పండిన వడ్లను భారీగా కొనుగోలు చేశారు. భారీ వర్షాల కారణంగా ఆ రాష్ట్రాలలో వరిసాగు దెబ్బతినడంతో తెలంగాణకు వచ్చారు. ఈసారి కర్నాటక, ఆంధ్రప్రదేశ్ స్టేట్మిల్లర్లతోపాటు నల్గొండ, కోదాడ, ఖమ్మం, హైదరాబాద్ జిల్లాల నుంచి 20 రోజుల కిందే వచ్చిన మిల్లర్లు జిల్లాలో వడ్లు కొనుగోళ్లు షురూ చేశారు. పచ్చివడ్లకు మొదట్లో క్వింటాల్కు రూ.2,450 చెల్లించి ప్రస్తుతం రూ.2,200 ఇస్తున్నారు. ఇప్పటిదాకా సుమారు నాలుగు లక్షల మెట్రిక్ టన్నులు సేకరించినట్లు తెలుస్తోంది. క్వింటాల్ వడ్లకు రూ.30 కమిషన్పై గ్రామాలల వారీగా ఏజెంట్లను నియమించుకుంటున్నారు. దీంతో సర్కారు కొనుగోళ్ల లక్ష్యం దెబ్బతింటోంది.

అంకెలు. సంఖ్యలు దాటని ఆఫీసర్ల ప్రణాళిక, ఈ ఖరీఫ్లో జిల్లాలో 12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేసిన ఆఫీసర్లు, అందులో 8 లక్షల టన్నులు 629 సర్కారు సెంటర్స్ఏర్పాటు చేసి కొనాలని ప్రణాళిక రూపొందించారు. సన్నరకం వడ్ల కోసం 465, దొడ్డురకానికి 164 సెంటర్లను ఓపెన్ చేస్తామని ప్రకటించారు. దసరా పండగ దాటినా ఇంకా సెంటర్లు తెరవలేదు. వడ్లు నింపడానికి కావాల్సిన 1.20 కోట్ల గన్నీ బ్యాగులు, టర్పాలిన్లు ఇంకా జిల్లాకు చేరలేదు. ప్రభుత్వ సెంటర్లు ఓపెన్ అయితే మద్దతు ధరతో పాటు సన్న వడ్లకు రూ.500 బోనస్ అంది ఆర్థికంగా లాభం పొందుతారు. బస్తాకు 3 కిలోల తరుగు తీసున్నా మిల్లర్లు చెల్లిస్తున్న రేట్ కాస్త పరవాలేదనుకున్నా రైతులు బోనస్ మాత్రం నష్టపోతున్నారు. పైగా ప్రభుత్వ కొనుగోళ్ల టార్గెట్కు కూడా పెద్ద దెబ్బే. వచ్చే జనవరి నుంచి రేషన్ కార్డులకు సన్నబియ్యం అందించాలనే సర్కారు నిర్ణయంపై కూడా ఇది ప్రభావం చూపుతుందని అంటున్నారు.

# తెలంగాణ భవన్ లో మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు చిట్ చాట్..!

**హైదరాబాద్ పెన్ పవర్:** రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక్క చీర కాదు మేము అధికారంలోకి వస్తే రెండు చీరలు ఇస్తామని చెప్పారు.బతుకమ్మ రోజు ఒక్క చీర కాదు కధా, ఉన్న చీర కూడా బంద్ పెట్టారు.అధికారంలోకి వస్తే రైతు బంధు రూ.10,000 కాదు, రూ.15,000 ఇస్తామని చెప్పి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు.కేసీఆర్ కిట్ బంద్ చేశారుచేప పిల్లలు చెరువుల్లోనే వదలడం లేదు, చేప పిల్లలు తక్కువగా పోవాలని అధికారులు ఆదేశాలు ఇస్తున్నారు.చేప పిల్లలకు టెండర్ పిలవలేదు, ముదిరాజ్లకు గంగపుత్రులకు తీవ్రమైన అన్యాయం చేసింది ఈ ప్రభుత్వం.మార్పు మార్పు అని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ఇవాళ ఈ మార్పులు చేస్తోందిరెండు చీరలు అన్నారు, ఉన్న చీర పోయింది.డబుల్ చేప పిల్లలు చెరువుల్లో వేస్తామనీ చెప్పి ఒక్క చేప పిల్ల కూడా చెరువుల్లో వేయలేదు, ఇదీ మార్పు చెరువులు పూర్తిగా నిండినప్పటికీ చేప పిల్లలు ఎందుకు వేయడం లేదు? ఆగస్ట్ లో పోయాల్సిన చేప పిల్లలను అక్టోబర్ వచ్చినా పోయలేదు. మేము 100కోట్లు



ఖర్చు చేస్తే. కాంగ్రెస్ ప్రభుత్వం చేప పిల్లల కోసం బడ్జెట్ లో పెట్టింది 16కోట్లు. రీజనల్ రింగ్ రోడ్ భూసేకరణ రీజనల్ రింగ్ రోడ్ మా హయంలో ఉత్తర, దక్షిణ భాగం రెండు భాగాలుగా ప్రతిపాదన చేశాం. ఉత్తర భాగం 158 కిలోమీటర్లు కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. భూసేకరణ కోసం 3ఏ ద్వారా నోటిఫికేషన్లు ఇవ్వటం జరిగింది. ఖర్చు మాత్రం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కలిసి సగం భరించేలా ప్రతిపాదన. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 10 నెలలు అవుతోంది, భూసేకరణ చేయడం లేదు, ఎందుకు ఆలస్యం జరుగుతోంది? ఉత్తర భాగంలో యుద్ధ ప్రాతిపదికన మార్కెట్ విలువ ప్రకారం రైతులకు డబ్బులు చెల్లించాలి. ఎల్ సి టి వారికి దక్షిణ భాగంలో అలైన్మెంట్ ఫైనల్ చేయమని నేషనల్ హైవే అథారిటీ వారు చెప్పారు. 182 కిలోమీటర్ల అలైన్మెంట్ పూర్తి చేసింది. దక్షిణ భాగం అలైన్మెంట్ పూర్తిగా మార్చారు ప్రముఖుల భూములు ఉన్నాయి అని అలైన్మెంట్ మార్చారు. ఒక్కసారి ఫైనల్ చేసిన అలైన్మెంట్ ని నేషనల్ హైవే అథారిటీ వారు ఒప్పుకోరు అని తెలిసి రాష్ట్ర ప్రభుత్వం అలైన్మెంట్ మార్చింది. నేషనల్ హైవే అథారిటీ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన అలైన్మెంట్ ని ఒప్పుకోకపోతే రాష్ట్ర ప్రభుత్వం 20 వేల కోట్లుతో దక్షిణ భాగం రీజనల్ రింగ్ రోడ నిర్మించబోతుంది. అలైన్మెంట్ మార్చడం వల్ల 182 కిలోమీటర్ల నుంచి 198 కిలోమీటర్లకు పెరిగింది. కాంట్రాక్టర్ల లాభం కోసం 20 వేల కోట్ల భారాన్ని రాష్ట్ర ప్రజలపై వేస్తున్నారు.

రుణమాఫీ కోసం అప్పు పుట్టడం లేదని మంత్రి తుమ్మల అంటున్నారు, అలైన్మెంట్ మార్చడం వల్ల 20 వేల కోట్లు ఎక్కడి నుంచి తెస్తారు మరి? మీ లాభం కోసం 20,000 కోట్ల అప్పు చేస్తారా అని ప్రశ్నించారు.

## నల్ల బ్యాడ్జీలతో ప్రైవేట్ డిగ్రీ కళాశాల యాజమాన్యం నిరసన

### నల్ల బ్యాడ్జీలతో అంబేద్కర్ విగ్రహానికి వినతి



**హైదరాబాద్ పెన్ పవర్:**ఆర్థిక భారంతో విద్యార్థులకు విద్యను అందించలేక పోతున్నామని, ప్రైవేట్ డిగ్రీ కళాశాల యాజమాన్యం ఆవేదన వ్యక్తం చేస్తూ నల్ల బ్యాడ్జీలతో అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇచ్చి తమ నిరసనను వ్యక్తం చేశారు. ప్రైవేట్ కళాశాలల బకాయిలు ప్రభుత్వం చెల్లించకపోవడంతో విధి లేని పరిస్థితుల్లో విద్యాసంస్థలను నిరవధిక బంద్ పాటిస్తున్నట్లు ప్రైవేట్ డిగ్రీ, పీజీ కాలేజ్ మేనేజ్మెంట్ అసోసియేషన్ పేర్కొంది. జిల్లా కేంద్రంలోని డిగ్రీ, పీజీ కళాశాల యాజమాన్యాల ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ కళాశాలలకు చెల్లించాల్సిన ఫీజు రియంబర్స్మెంట్ చెల్లించడం లేదని దీంతో విద్యాసంస్థలను నడపడం భారంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దసరా పడగకు ముందు విడతల వారీగానైన నిధులు విడుదల చేయాలని ప్రభుత్వానికి విన్నవించుకున్నా ఇప్పటి వరకు స్పందించలేదని, గత మూడు సంవత్సరాలుగా ఫీజు రియంబర్స్మెంట్ తో పాటు విద్యార్థులకు రావాల్సిన స్కాలర్షిప్ రావడం లేదన్నారు. నిరుద్యోగులు ఉపాధి కోసం విద్యాసంస్థలను స్థాపిస్తే ప్రభుత్వాలు బకాయిలు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నయని వారు ఆరోపించారు. ఆర్థికంగా ఇబ్బందులతో కుటుంబాలను పోషించుకోలేని స్థితిలో ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు ఉన్నాయని, ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రైవేట్ డిగ్రీ పీజీ కళాశాలల ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే చెల్లించాలని లేని పక్షంలో రాష్ట్ర స్థాయిలో ఆందోళనలు ఉదృతం చేస్తామని వారు హెచ్చరించారు.

## ఐ టీ ఐ లో ప్రవేశాలకు దరఖాస్థులు ఆహ్వానం

**భూపాలపల్లిపెన్ పవర్:** తెలంగాణ ప్రభుత్వ ఉపాధి మరియు శిక్షణ శాఖ ప్రభుత్వ ఐటిఐ, భూపాలపల్లి నందు కొత్తగా ప్రవేశ పెట్టిన ఆరు అడ్వాన్స్డ్ టెక్నాలజీ కోర్సులల్లో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఐడిఓసి కార్యాలయంలో కలెక్టర్ ఛాంబర్లో గురువారం ప్రాంతీయ ఉప సంచాల కులు, భూపాలపల్లి, కాజీపేట ఐఐటి ప్రిన్సిపాల్స్ తో ఆడ్వాన్స్డ్ టెక్నాలజీన సెంటర్ లో ప్రవేశాలు, కళాశాలలో సౌకర్యాలు కల్పనపై సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 10వ తరగతి ఆపై విద్యార్హతలు కలిగిన విద్యార్థిని, విద్యార్థులు భూపాలపల్లి, సుభాష్ నగర్ కాలనీలోని ఐటీఐ కళాశాలలో నేరుగా కానీ వెబ్సైట్ ద్వారా కానీ అడ్మిషన్లు పొందేందుకు ఈ నెల 19వ తేది వరకు అవకాశం ఉన్నట్లు తెలిపారు. ప్రభుత్వం కొత్తగా ప్రవేశ పెట్టిన ఆరు అడ్వాన్స్డ్ టెక్నాలజీ కోర్సులలో శిక్షణ పొందటానికి ప్రభుత్వ ఐటిఐ భూపాలపల్లిలోని ఖాళీగా వున్న సీట్లు భర్తీ కొరకు 6వ విడత వాక్ – ఇన్ ఇంటర్వ్యూ ద్వారా అడ్మిషన్లకు అర్హులైన విద్యార్థులు నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు ఆయన తెలిపారు. దరఖాస్తు చేసేందుకు ఈ నెల 19వ తేది ఉదయం 11 గంటల వరకు అవకాశం ఉందని తెలిపారు. అభ్యర్థులు నేరుగా వాక్ ఇన్ – ఇంటర్వ్యూ ద్వారా కూడా హాజరు కావొచ్చని తెలి పారు. 17.10.2024 నుండి 19.10.2024 తేదీ వరకు ప్రభుత్వ ఐ.టి.ఐ భూపాలపల్లి, సుభాష్ కాలనీ నందు హాజరుకావాలని ఆయన సూచించారు.

## కడప మున్సిపల్ కమిషనర్ గా భాద్యతలు స్వీకరించిన మనోజ్ రెడ్డి

హైదరాబాద్ పెన్ పవర్:కడప మున్సిపల్ కమిషనర్ గా మనోజ్ రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో కడప అభివృద్ధి చేయడానికి కృషి..డ్రైనేజ్ వ్యవస్థ పై అధికారులతో సమీక్ష చేసి మెరుగైన డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు వర్షాలు వచ్చినప్పుడు నీరు నిలవకుండా చర్యలు తీసుకుంటాము...

మంచి నీటి సరఫరా కు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం..ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటాను..నీటి కొరత రాకుండా ఏమి చేయాలనే విషయంపై అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటాముకార్పొరేషన్ లో ప్రభుత్వ భూముల ఆక్రమణపై చర్యలు తీసుకుంటాం..ఆక్రమణలు జరిగి ఉంటే అధికారులతో రివ్యూ చేసి భూములను వెనక్కి తీసుకుంటామమని అన్నారు.

## కడప ఇంచార్జ్ కలెక్టర్ గా అదితి సింగ్

హైదరాబాద్ పెన్ పవర్:కడప ఇంచార్జ్ కలెక్టర్ గా అదితి సింగ్ నియమితులయ్యారు. కడప కలెక్టర్ లోతేటి శివశంకర్ తెలంగాణ కేడర్ కు కేటాయించడంతో అయన తెలంగాణ సెక్రెటేరియట్ లో రిపోర్ట్ చేసుకున్నారు. దాంతో × కడప ఇంచార్జ్ కలెక్టర్ గా జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ కు బాధ్యతలు అప్పగించారు.

## పిడుగుపాటుకు కౌలు రౌతు దుర్మరణం



హైదరాబాద్ పెన్ పవర్: రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డి పేట మండలం బండ లింగం పల్లి లో విషాదం జరిగింది. పొలం వద్ద పాడి గేదె పాలు పితికి ఇంటికి వచ్చే క్రమంలో కామిడి నరసింహా రెడ్డి అనే రైతు పై పిడుగు పడింది. దాంతో అయన అక్కడిక్కడే దుర్మరణం చెందాడు. మృతుడు ఎల్లారెడ్డి పేట మండలంలోని ఓ రాజకీయ పార్టీ నాయకుడి కి చెందిన వ్యవసాయ పొలం కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. పోస్ట్ మార్టం నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి మృతదేహాన్ని పోలీసులు తరలించారు. మృతుడికి భార్య,కుమారుడు ఉన్నారు.

## మొసళ్ల రవాణ లారీ బోల్తా


హైదరాబాద్ పెన్ పవర్:నిర్మల్ జిల్లాలో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. మామడ మండలం మొండిగుట్ట గ్రామ సమీపంలో 44 జాతీయ రహదారిపై మొసళ్లతో వెళ్తున్న లారీ బోల్తా పడింది. ఈ లారీ బీహార్ జిల్లా పాట్నాలోని సంజయ్ గాంధీ బయోలాజికల్ పార్క్ నుండి, కర్ణాటక రాజధాని బెంగళూరులోని బానర గట్ట్ బయోలాజికల్ పార్కుకు ఎనిమిది మొసళ్ళతో వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంతో రెండు మొసళ్ల బయటకు రావడంతో వాటిని అధికారులు బంధించారు.

## పరిగి రోడ్ యాక్సిడెంట్ లో ముగ్గురు మృతి

హైదరాబాద్ పెన్ పవర్:వికారాబాద్ జిల్లా పూడూరు గేటు ముందు ఆర్టీసీ బస్సు బైక్ ఢీకొని ముగ్గురు యువకులు మృత్యువాతకు గురయ్యారు. ఇద్దరు మేడికొండ గ్రామానికి చెందినట్లు మరో యువకుడు గొంగుపల్లి గ్రామానికి చెందినట్లు పోలీసులు గుర్తించారు.పూడూరు గ్రామంలో నుంచి మేడికొండ గ్రామానికి వెళుతుండగా హైదరాబాదు నుంచి సేదం వెళుతున్న, హైదరాబాద్ డిపో 1 ఆర్టిసి బస్సు బైక్ ను ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది.బైక్ పై ఉన్న ఇద్దరు యువకులతో పాటు ఓ బాలుడు అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాలను పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు. ఘటన స్థలానికి చేరుకున్న పరిగి సిఐ ప్రమాదంపై వివరాలు సేకరిస్తున్నారు. ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ డ్రైవర్ని అదుపులోకి తీసుకొని బస్సును పోలీస్ స్టేషన్ కు తరలించారు .

# న్యాయదేవతకు కళ్ల గంతలు తొలగింపు.. చారిత్రాత్మక ఘట్టం..!

హైదరాబాద్ పెన్ పవర్:బ్రిటీష్ కాలం నాటి పేర్లు, గుర్తుల సవరణల నేపథ్యంలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. కోర్టులు, లీగల్ ఛాంబర్లు, సినిమాలలో కళ్లకు గంతలు కట్టి కనిపించే న్యాయ దేవత విగ్రహం రూపు మారింది. కళ్ల గంతలను సుప్రీంకోర్ట్ తొలగించింది. అంతేకాదు న్యాయ దేవత ఒక చేతిలో ఉండే ఖడ్గం స్థానంలో రాజ్యాంగ ప్రతిని ఉంచింది. బ్రిటీష్ కాలం నాటి దుస్తుల స్థానంలో చీరకట్టుతో విగ్రహాన్ని రూపొందించారు. ఈ మేరకు కొత్త విగ్రహాన్ని సుప్రీంకోర్టులోని న్యాయమూర్తుల లైబ్రరీలో ఏర్పాటు చేశారు. భారతీయ న్యాయవ్యవస్థ చిహ్నానికి కొత్త రూపును తీసుకురావడమే లక్ష్యంగా ఈ కీలక మార్పులు జరిగాయి. తద్వారా, చట్టం ఇకపై గుడ్డిది కాదు




అని సుప్రీంకోర్ట్ స్పష్టమైన సందేశం ఇచ్చినట్టు అయింది. ఈ మార్పులు తీసుకొచ్చేందుకు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ చొరవ చూపించారు. మార్పుల అవసరాన్ని ఆయన గుర్తుచేశారు.

కాగా మునుపటి న్యాయ దేవత విగ్రహం ఒక చేతిలో శిక్షకు చిహ్నంగా ఖడ్గం ఉండేది. దాని స్థానంలో అందరికీ సమానత్వాన్ని అందించే రాజ్యాంగాన్ని ఉంచారు. వలస వారసత్వాన్ని అధిగమించి ముందుకు వెళ్లాల్సిన తరుణం ఇదని సీజెఐ డీవై చంద్రచూడ్ భావించారని సుప్రీంకోర్ట్ వర్గాలు చెబుతున్నాయి. చట్టం గుడ్డిది కాదు. అందరినీ సమానంగా చూస్తుంది, అని ఆయన అన్నారని సమాచారం. అందుకే న్యాయ దేవత కొత్త రూపంలో ఈ సూత్రం ప్రతిబింబించేలా చూసుకున్నారు.

# విద్యార్థినుల పేరుతో ఇన్స్టాగ్రామ్ అకౌంట్లు వేధింపులకు పాల్పడుతున్న ఐదుగురిపై కేసు నమోదు..?

*జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్*



రాజన్న సిరిసిల్ల పెన్ పవర్: విద్యార్థినుల పేరుతో ఇన్స్టాగ్రా మ్ అకౌంట్లతో వేధింపులకు పాల్పడుతున్న ఐదుగురిపై కేసు నమోదు చేసామని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ వెల్లడించారు. సోషల్ మీడియాలో వేదికగా మహిళల విద్యార్థినుల పట్ల వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు. మహిళలు, విద్యార్థినులు వేధింపులకు గురైతే నిర్భయంగా జిల్లా షీ టీమ్ నెంబర్ 8712656425 కు పిర్యాదు చేసినచో వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.


ఈ మధ్య కాలంలో సోషల్ మీడియాలో ఫెక్ ఐడి లతో ఇన్స్టాగ్రామ్ ఫేస్ బుక్, అకౌంట్ లు క్రియేట్ చేసి,లేదా మహిళల సోషల్ మీడియా అకౌంట్స్ ని హ్యాక్ చేసి అసభ్యకర వీడియోలు, ఫోటోస్ పంపుతూ మహిళలు, విద్యార్థినుల వేధింపులు గురి అవుతున్న పిర్యాదులు ఎక్కవ వస్తున్నాయని, అలాంటి వేధింపులకు పాల్పడే పోకిరిల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని, సోషల్ మీడియా వేదికగా ఆడపిల్లలను, మహిళలను వేధించినా, అసభ్యంకర ఫొటోలు, వీడియోలు పంపిన, సోషల్ మీడియా అకౌంట్లలో పోస్టు చేసినా, మిత్రులకు షేర్ చేసినా తీవ్రమైన నేరంగా పరిగణించి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఇలాంటి స్మసమ్యలపై జిల్లా పోలీస్ నిఘా ఉంటుందని ఇలాంటి సమస్యలపై మహిళలు, విద్యార్థినులు నిర్భయంగా జిల్లా షీ టీమ్ కి పిర్యాదు చేయాలని తెలిపారు.

జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో విద్యార్థినుల పేరుతో ఇన్స్టాగ్రామ్ అకౌంట్ క్రియేట్ చేసి లేదా వారి అకౌంట్ హ్యాక్ చేసి వేధింపులకు పాల్పడుతున్న ఐదుగురు పోకిరీలపై కేసు నమోదు చేయడం జరిగిందని,సోషల్ మీడియా వేదికగా కానీ,పని చేసే ప్రదేశాల్లో కానీ, పాఠశాలలో, కళాశాలల్లో మహిళలను , విద్యార్థినులకు వేధింపులకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవని, మహిళలు విద్యార్థినులు వేధింపులకు గురైనట్లయితే వెంటనే డయల్ 100, లేదా షీ టీం నెంబర్ 87126 56425 కి పిర్యాదు చేసినచో వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, పిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచబడతాయని అని తెలిపారు.

# నివాస గృహాల మధ్య మద్యం షాపులు స్థానికుల ఆందోళన

హైదరాబాద్ పెన్ పవర్:

నివాస గృహాల మధ్య షాపులు వెలుస్తూ ఉండడంతో ఆ ప్రాంతంలోని మహిళలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాలలో నివాస గృహాల మధ్య మద్యం షాపులు ఏర్పాటు చేయరాదని, మద్యం షాపులు ఏర్పాటు చేస్తే మహిళలు పలు ఇబ్బందులకు గురి అవుతారని ఆందోళన చేయడంతో పాటు సంబంధిత శాఖ అధికారులకు వినతి పత్రం అందిస్తున్న విషయం అందరికీ తెలిసిందే. ఇది ఇలా ఉండగా చల్లపల్లి బైపాస్ రోడ్డు లోని సాగర్ థియేటర్ మరియు కమ్యూనిస్టు కార్యాలయానికి అతి సమీపంలో నివాస గృహాల మధ్య మద్యం షాపు ఏర్పాటు చేయడంతో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇప్పటివరకు ప్రశాంత వాతావరణంలో జీవనం సాగిస్తున్నామని రేపటినుండి ఎలాంటి పరిస్థితులను ఎదుర్కోవలసి వస్తుందోనని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నివాస గృహాల మధ్య మద్యం షాపు ఏర్పాటు చేస్తుంటే




అధికారులు ప్రజల ఇబ్బందులను పట్టించుకోరా అంటూ ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రజల ఇబ్బందులను గమనించి నివాస గృహాల మధ్య మద్యం షాపులను ఏర్పాటు చేయకుండా తగు చర్యలు తీసుకోవాలని ప్రజలకు, మహిళలకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చర్య తీసుకోవాలని కోరుతున్నారు.